# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 01 ఆగస్టు, 2026 | పేజీలు : 08


## నేడు 'ఎల్లంపల్లి'కి మంత్రులు !



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పరిశ్రమలు, ఐ.టి. శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు శనివారం సందర్శించనున్నారు. సాయంత్రం 3.50 గంటలకు వారు ప్రాజెక్టును సందర్శించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో ఎగువ నుంచి వరద ప్రవాహం ఎల్లంపల్లి జలాశయంలోకి రావడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

## విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం




### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం / జమ్మికుంట :** విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. శుక్రవారం జమ్మికుంటలోని బిసి, ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, పడక గదులు, స్టోర్‌రూమ్, వంట గదిలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఆత్మీయంగా పలకరిస్తూ చదువు, భోజనం, వసతి, ఆరోగ్యం, పాఠశాలకు వెళ్లే విధానం గురించి ఆరా తీశారు. విద్యార్థులు చెప్పిన ప్రతి విషయాన్ని ఓపికగా వింటూ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడిన తీరు అక్కడివారిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఎలా చదువుకుంటున్నారు స్కూల్ కు ఎలా వెళ్తున్నారు. భోజనం బాగుందా, దోమల సమస్య ఏమైనా ఉందా అంటూ అప్యాయంగా అడిగి తెలుసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించడంతో పాటు తల్లిదండ్రులకు, పాఠశాలకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం వంట గది, స్టోర్ రూంలోని బియ్యం, పప్పులు, కూరగాయలు నూనె తదితర నిత్యావసర సరుకులను పరిశీలించి గడువు ముగిసిన ఆహార పదార్థాలు వినియోగించరాదని సిబ్బందిని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా ఉంటే సహించబోమని స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని దోమల నివారణ చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచేలా చూడాలని అధికారులకు సూచించారు. రెండు వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టి అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. అంచనా వ్యయం సిద్ధం చేయాలని రిపేర్లు ఆలస్యం చేయకుండా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో జమ్మికుంట డిప్యూటీ తహసీల్దార్ శంకర్, టిజిడబ్ల్యుఐడిసిఎఇ రమేశ్ తోపాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలి



### అధికారులను ఆదేశించిన జగిత్యాల కలెక్టర్

**ప్రజాపక్షం/ధర్మపురి :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్న నేపథ్యంలో ధర్మపురి మండలం నర్సయ్యపల్లి – కొత్త కొరండ్లపల్లి మధ్య కల్వర్టు లు తెగిపోవడంతో పాటు ఆకసాయిపల్లి – నాగారం గ్రామాల మధ్య రోడ్‌డ్యామ్ బ్రేచ్ కావడంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు.దెబ్బతిన్న కల్వర్టు, రోడ్‌డ్యామ్ ప్రాంతాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేయాలని పేర్కొన్నారు. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్షాల కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాకపోకలు సాగించవద్దని, ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి,పోలీసు,రెవెన్యూ శాఖల సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.అదేవిధంగా బుద్దేశ్‌పల్లి గ్రామ పరిధిలోని చెరువు మత్తడిని పరిశీలించి వరద ఇఇన్ ఫ్లో పరిస్థితి గురించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**గోదావరి ప్రవాహం పరిశీలన :** గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ధర్మపురి మండలం రాయపట్నం వద్ద గోదావరి నదీ వరద ప్రవాహాన్ని శుక్రవారం జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా నదిలో ప్రస్తుత నీటిమట్టం, వరద ప్రవాహం, ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న ఇన్ ఫ్లో పరిస్థితులను అధికారుల ద్వారా తెలుసుకున్నారు వెంట ఆర్డీఓ మధుసూదన్, తహశీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్,ఎంపిడిఓ ,సంబందిత అధికారులు ఉన్నారు.

## నిర్మల్ వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలు

### జిల్లా ఎస్‌పి జానకి షర్మిల




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని 01 ఆగస్టు 2026 నుండి 31 ఆగస్టు 2026 వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిల, ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.సెక్షన్–30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, వదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రసారం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు .ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని, సభలు, సమావేశాలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్‌పి సూచించారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

## సోలార్ ప్లాంట్‌ను వచ్చే వారం ప్రారంభించాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ధర్మారం మండలంలోని ఖిలా వనపర్తి గ్రామంలో నిర్మాణం పూర్తయిన సోలార్ ప్లాంట్‌ను వచ్చే వారం ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మారం మండలంలోని ఖిలా వనపర్తి గ్రామంలో నిర్మాణం పూర్తయిన సోలార్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి,ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసి వచ్చే వారం ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఎలిగేడు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాం నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఆధునిక నిల్వ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా గోదాం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని,పనుల అమలులో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డి.సి.ఓ.శ్రీ మాల, ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, ఎలిగేడు తహసిల్దార్ యాకన్న,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.





వివరాలు మెయిన్‌లో...

## బిఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయం

## కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఉప సర్పంచ్

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం వెంకటయ్యపల్లె గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ మహమ్మద్ ఆసిఫ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైన తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఉప సర్పంచ్ ఆసిఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 3 నెలల ఉచిత రేషన్ పంపిణీ

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** ఆహారభద్రత కార్డు దారులకు 3 నెలల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ నేటి నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఋతుపవనాలు, వర్షాకాలం, రవాణా తదితర సమస్యలను ఎదుర్కోవడానికి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ సరుకులు ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు దారులు బయోమెట్రిక్ మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుందని ఇట్టి సరుకులు ఈనెల 31 వరకు పంపిణీ చేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మా కాలనీ సమస్యను తీర్చండి సార్లు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని నాలుగో వార్డులో రోడ్డంతా బురద మయమై ఇబ్బందుల పాలవుతున్నామని మా కాలనీలో ఉన్న సమస్యను తీర్చండి అంటూ కాలనీ మహిళలు ప్రజాప్రతినిధులను అధికారులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో చినుకు పడితే గుంతలుగా ఉండడంతో పందుల స్వైర చేయగా,నీరు గుంతలలో చేరి రోగాల పాలవుతున్నామని,సీసీ రోడ్లు డ్రైనేజీలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని నాయకులు స్పందించి తమ కాలనీ సమస్యను తీర్చాలని వేడుకుంటున్నారు.గ్రామంలో చిన్నాచితక కాలనీలలో సైతం సీసీ రోడ్లు నిర్మించారని,కానీ నిత్యం జనాలు నడిచే ఈ దారిని మరిచారని మీకు ఇది తగునా అంటూ మహిళలు ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు.

## చిన్నారుల జీవితాల్లో వెలుగు నింపడమే ఆపరేషన్ ముస్కాన్ లక్ష్యం

### జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, లేబర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సమగ్ర బాలల పరిరక్షణ పథకం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జూలై 1 నుండి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ XII కరీంనగర్ లో విజయవంతంగా ముగిసిందని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి తెలిపారు. చిన్నారుల జీవితాల్లో వెలుగు నింపుతూ, బాల కార్మికులు లేని జిల్లాగా మార్చడమే లక్ష్యంగా కొనసాగుతుందని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కమిటీ సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, కే.విజయ్ కుమార్, రాధ, అర్చన లతో కలిసి నేడు కరీంనగర్ బాలరక్ష భవన్ లో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్రంలోని 33 జిల్లాలోను, సమగ్ర బాలల పరిరక్షణ పథకం, చైల్డ్ లైన్ 1098, పోలీస్, లేబర్, రెవెన్యూ, విద్యా మొదలగు శాఖల సహకారంతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లాలోని 16 మండలాల్లో నాలుగు విభాగాలుగా, కరీంనగర్ రూరల్, కరీంనగర్ అర్బన్, హుజురాబాద్, కరీంనగర టాస్క్ ఫోర్స్ నాలుగు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి టీంలో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై నలుగురు కానిస్టేబుళ్లు, సమగ్ర బాలల పరిరక్షణ పథకం సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రతినిధి, లేబర్ ఆఫీసర్ సంయుక్తంగా నెల రోజులపాటు విస్తృతంగా తనిఖీలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తము 151మంది పిల్లలను రెస్క్యూ చేయడం జరిగిందని, 151మంది బాలబాలికలు (147 బాలురు,04బాలికలు) చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

## కెజిబివిలో ఆషాఢ గోరింటాకు వేడుకలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆషాడ మాసం గోరింటాకు సంబరాలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో భారతీయ సంస్కృతి,సాంప్రదాయాలను విద్యార్థినులకు పరిచయం చేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీడ్ ఇండియా రాష్ట్ర సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, పండుగలకు ఉన్న విశిష్టతను నేటి తరం విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మెకుమార్ మాట్లాడుతూ సమాజ సేవే ధ్యేయంగా పనిచేసే లయన్స్ క్లబ్ మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడంలోనూ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.కెజిబివి స్పెషల్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండాకెజిబివి విద్యార్థినులకు చదువుతో పాటు మన ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి నట్ట సురేష్, కెజిబివిపాఠశాల ఉపాధ్యాయులు ,లయన్స్ క్లబ్ ప్రతినిధులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేడు, రేపు నగరంలో బిల్డ్ ఎక్స్‌పో-2026

### ఎసిసిఇఐ ప్రతినిధులు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** భవన నిర్మాణ రంగంలో వస్తున్న నూతన పరిజ్ఞానం, ఆధునిక ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కరీంనగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 1, 2 తేదీలలో 6వ బిల్డ్ ఎక్స్‌పో2026 నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా కరీంనగర్ సెంటర్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ చైర్మన్ నల్ల లక్ష్మయ్య, ఎక్స్‌పో కన్వీనర్ పాకపావన కృష్ణ, సెక్రటరీ సబ్బని శ్రీనివాస్, స్పాన్సర్ షిప్ కమిటీ హెడ్ వేల్పుల శ్రవణ్ మాట్లాడుతూ ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. ఇల్లు నిర్మించుకునే సామాన్య ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తుల ఎంపిక, ఆధునిక నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ బిల్డ్ ఎక్స్‌పోను ఈసారి ఆరోసారి ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన ఫౌండేషన్ నుంచి ఇంటీరియర్ వరకు అన్ని రకాల ఉత్పత్తులు ఒకే ప్రాంగణంలో లభిస్తాయని స్పష్టం చేశారు. స్టీల్, సిమెంట్, పెయింట్స్, హార్డ్‌వేర్, ప్లైవుడ్, లామినేట్స్, లిఫ్ట్, వాటర్ ప్రూఫింగ్ కెమికల్స్, ఎలక్ట్రికల్, శానిటరీ ఉత్పత్తులు, యూపీవీసీ విండోస్, వీటీ స్లాబ్ టెక్నాలజీతో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీల ప్రతినిధులు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు ఉచితంగా సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. ఈ ఎక్స్‌పోకు ప్రవేశం ఉచితమని సందర్శకులకు లక్కీ కూపన్లు కూడా అందజేస్తామని వివరించారు. ఈ సమావేశంలో కోశన్నినర్సు కోల అన్నారెడ్డి, గడ్డం హరికిషన్, కోశాధికారి వేణుమాధవ్, ప్రతినిధులు అనిల్, ప్రమోద్, రంజిత్ కుమార్, రాజగోపాల్, ప్రశాంత్, జి.వెంకటకిషన్, గొల్లపల్లి వెంకటేశ్, ఫణిందర్, జగదీశ్, ప్రవీణ్ చారి, పి. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా ఉప్పులేటి నరేష్

**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని ల్యాగలమర్రి గ్రామంలో అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.శుక్రవారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఉప్పులేటి నరేష్, ఉపాధ్యక్షుడిగా న్యాతరి మొండయ్య,ప్రధాన కార్యదర్శిగా లింగంపెల్లి రాజయ్య,కార్యదర్శిగా ఉప్పులేటి తిరుపతి, కోశాధికారిగా ఎస్ రాము వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్కటూరి రవి,మాజీ అధ్యక్షుడు వడ్లూరి పెద్ద లింగయ్య,ఉప్పులేటి సత్యం, వడ్లూరి కనకయ్య,లింగంపల్లి అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపిడిఓ

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో సి.హెచ్. గణేష్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో రిజిస్టర్లు, ఆహార నిల్వలు,శానిటేషన్, ఫుడ్ మెనూ, భోజన నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,పంచాయతీ కార్యదర్శి అర్షద్ పాల్గొన్నారు.

## ఇసుక మేటలు వేసిన పొలాలు పరిశీలన

**ప్రజాపక్షం/ధర్మపురి :** గత రెండు మూడు రోజులుగా మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ధర్మపురి మండలం ధమ్మన్నపేట గ్రామ శివారులో నాటువేసిన వరి పొలాలు ఇసుకతో కప్పబడగా శుక్రవారం సంబంధిత అధికారులు సదరు పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో భూమి కోతకు గురై ఇసుక మేటలు పేరుకుపోయి వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు.పంట నష్టాన్ని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ పరిశీలించి రైతుల నుండి వివరాలు సేకరించారు. నష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనా వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశానుసారం పంటనష్ట వివరాలు నమోదు చేయడం జరుగుతుందని ఎంఏఓ రాజ్ కుమార్ రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి అజయ్ కుమార్,ఉప సర్పంచ్ గంగాధర్, గంగమల్లయ్య,భూమేష్,సత్తయ్య గ్రామ రైతులు ఉన్నారు.

## చేపల వేటకు వెళ్లి.. పాము కాటుతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పెగడపల్లి :** చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన పెగడపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన మన్నే మల్లయ్య (66) తండ్రి లస్మయ్య, గురువారం రాత్రి దాదాపు 7 గంటల సమయంలో చేపలు పట్టడానికి పక్కనే ఉన్న లింగాపూర్ గ్రామ చెరువుకు వెళ్లాడు.ఆ సమయంలో అతనికి అకస్మాత్తుగా శ్వాస ఆడకపోవడంతో ఇబ్బంది పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు మల్లయ్యను అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. మల్లయ్య విషపూరితమైన పాము కాటు వల్లనే మరణించినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య మన్నే హనుమక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకునిదర్యాప్తుచేస్తున్నట్లుఎస్ఐకిరణ్ కుమార్ తెలిపారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

### చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం / జమ్మికుంట :** పట్టణ పరిధిలోని ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగేటువంటి శ్రీ మడలేశ్వరస్వామి బోనాల పండుగ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడి ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని అన్నారు. దేవాలయంలో కొంత మేర మరమ్మత్తుల పనులు మిగిలి ఉన్నాయని రజక సంఘం నాయకులు తెలపడంతో తనవంత సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాములతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ అండగా ఉంటుంది

### పోలీసులు నిందితులను వెంటనే అరెస్ట్‌చేయాలి * బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు



**ప్రజాపక్షం / గన్నేరువరం :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన మాజీ సర్పంచ్ భర్త బేతల్లి రాజేందర్ రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జీ.వీ.రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో బేతల్లి రాజేందర్ రెడ్డి కుటుంబాన్ని మండల నాయకులతో కలిసి పరామర్శించారు. కేసు పురోగతిపై బాధిత కుటుంబాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం పోలీసులు నిందితులను అరెస్ట్ చేయకుండా వేడుక చూస్తున్నారని నిందితుల కుటుంబానికి రక్షణ కల్పిస్తున్నారని తమకు మాత్రం సహకరించడం లేదని బిఆర్ఎస్ నాయకులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా జీవీఆర్ మాట్లాడుతూ పోలీసులు వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలని లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పీఏ మురళీధర్ రెడ్డి యధావిధిగా ఎమ్మెల్యే కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నప్పటికీ పోలీసులు అతడిని ఎక్కడున్నారో గుర్తించి పట్టుకోకపోవడం విచారకరమని అన్నారు. బాధిత కుటుంబానికి ఏ ఒక్కరూ సహాయం చేయకుండా గ్రామస్థులను బెదిరింపులకు గురి చేయడం ఏమిటని ఇదేమైనా రాయలసీమ ప్రాంతమా తెలంగాణ గడ్డపై ఈ విధమైన బెదిరింపులు సాగవని హెచ్చరించారు. రాజేందర్ రెడ్డి కుటుంబానికి న్యాయపరమైన సహాయం అందించడానికి ఇప్పటి నుంచి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పోలీసులు వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గంప వెంకన్న, పాకాల మైపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పుల్లెల లక్ష్మన్, మాజీ వైస్ ఎంపిపి న్యాత సుధాకర్, గూడెల్లి ఆంజనేయులు, తాడూరి వంశీకృష్ణారెడ్డి, కాంతాల విక్రంరెడ్డి, లింగాల లక్ష్మణ్, గొల్లపల్లి రవి, కొట్టె భూమయ్య, గూడూరి సురేశ్, నేలపట్ల శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పేద పౌరుడికి ప్రభుత్వ పథకాలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రతి పేద పౌరుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూసే బాధ్యత వార్డు కాంగ్రెస్ నాయకులదేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో 3,16,28 వార్డ్ కార్యకర్తల సమావేశం పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ లు హాజరై మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలో ఇల్లు లేని పేదవారు ఉండ కూడదనే ఉద్దేశంతో ప్రతి పేద బడుగు బలహీన వర్గాలకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. ఆగస్టు మూడవ తేదీ లోపు సర్ ప్రక్రియ పూర్తవుతుందని, ఈలోపు సర్ ఫారంను నింపి బి ఎల్ ఒ లకు అందించాలని సూచించారు. ఈ బాధ్యత వార్డు అధ్యక్షులు తీసుకోవాలని కోరారు. ఈ ఫారంను సమర్పించకపోతే ఓటు హక్కు పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వారూప తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, కాంగ్రెస్ చేనేత సెల్ పట్టణ అధ్యక్షులు గుడిసెట్టి బాలరాజ్, నాయకులు శ్రీగాధ మైసయ్య, నీలి రవీందర్, గుంజే రమేష్, దేవదాసు, శివ, ఆడెపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భారతీయ డ్రైవర్లను ప్రొఫెషనల్ డ్రైవర్లుగా తీర్చి దిద్ది జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు హనా విస్టా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు కొత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ (ఐటి డిఆర్) ప్రిన్సిపాల్ దొరై మురుగన్ తెలిపారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి ఐటి డిఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ను ఆ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఐటి డిఆర్ తో దీర్ఘకాలిక భాగస్వామ్య అవకాశాలను కల్పించేందుకే సంస్థ సీఈఓ సయూరి మత్సునో తెలంగాణ ఐఏఎస్ అధికారి హరి ప్రసాద్ ఆదేశానుసరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ శిక్షణ విధానం, మౌలిక సదుపాయాలు, శిక్షణ పరికరాలు, నిర్వహణ ప్రమాణాలు, మొత్తం శిక్షణ వాతావరణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉపాధి అవకాశాలను కల్పించేందుకు దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవాలని సిరిసిల్ల ఐటి డిఆర్ నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ భాగస్వామ్యం అమల్లోకి వస్తే తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యవేక్షణలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్, మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, ఐటీడీర్ ప్రిన్సిపాల్ దొరయ్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిపై ఆరోపణలు సరికావు

## మాజీ మేయర్‌పై డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఫైర్

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** యూడిఎఫ్ సాకుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపణలు చేయడం సరైంది కాదని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఫైర్ అయ్యారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఎస్‌బిఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు మీలా చౌకబారు అలోచనలు ఉండవని అన్నారు. ఆరోపణలు చేసేముందు ఆత్మవిమర్శ చేసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. ఎక్సెస్ టెండర్లలో 40 కోట్ల అవినీతి జరిగిందని అనవసరపు ఆరోపణలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. 5 సంవత్సరాలు మేయర్‌గా 2 సంవత్సరాలు సివిల్ సప్లై చైర్మన్‌గా కొనసాగిన రవీందర్ సింగ్‌కు ఎక్సెస్ టెండర్ల నిర్వహణ గురించి అవగాహన లేదా అని విమర్శించారు. మీరు ఏ సంస్థ పేరు అయితే చెబుతున్నారో అదే సంస్థకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 6 వేల కోట్ల రూపాయల పనులకు ఎలా కట్టబెట్టిందని దమ్ముంటే మీ ప్రభుత్వ హాయంలో జరిగిన ప్రాజెక్టుల ఎక్సెస్ టెండర్లపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి బండి సంజయ్ కుమార్ స్మార్ట్‌సిటీపై ఎక్కడా ఫిర్యాదు చేయలేదని స్మార్ట్‌సిటిపై గత ఎన్నికల్లో వాస్తవాలు మాట్లాడారు కాబట్టే ప్రజలు తమకు పట్టం కట్టారని అన్నారు. ఇచ్చిన వాగ్దానం ప్రకారం కరీంనగర్‌ను యూసిఎఫ్ స్కీంలో చేర్చి నగర అభివృద్ధి కోసం రూ.840 కోట్లు నిధులు విడుదల చేయించిన ఘనత మా నాయకులు బండి సంజయ్ కుమార్‌దని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జగిగిన ప్రాజెక్టుల ఎక్సెస్ టెండర్లు ఎవరు ఇచ్చారో వాటికి రవీందర్ సింగ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే మాజీ మేయర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజేపి కార్పోరేటర్లు వొంటెల సత్యనారాయణ, వంగల పవన్, బండారి వేణు, కొలిపాక శ్రీనివాస్, పొన్నం మొండయ్య, బిజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత వర్షాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం

## ఉద్యానవన అధికారి గడ్డం శ్యాంప్రసాద్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఆయిల్‌పామ్ మొక్కల నాటడానికి, కొత్త తోటల స్థాపనకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రైతులు ఈ అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని సూచించారు.ప్రస్తుతం సరిపడా వర్షపాతం నమోదవుతుండటంతో భూమిలో తేమ సమృద్ధిగా ఉండి, కొత్తగా నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు వేగంగా స్థిరపడేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు.రానున్న కాలంలో వర్షాభావ పరిస్థితులు లేదా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.వరి సాగుతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు నీటి వినియోగం సమర్థవంతంగా ఉండటంతో పాటు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ వంటి పద్ధతులను అవలంబించడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని,రైతులు మొదటి సంవత్సరాల్లో తోట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉన్నప్పటికీ, 4వ సంవత్సరానికి తోటలు పూర్తిగా అభివృద్ధి చెంది గెలల కోత ప్రారంభమవుతుందనీ, గెలల కోత ద్వారా నిరంతర ఆదాయాన్ని పొందే అవకాశం ఉండటం ఈ పంట యొక్క ప్రధాన ప్రత్యేకతని,తోటలు పూర్తిగా అభివృద్ధి చెందే వరకు మొదటి మూడు సంవత్సరాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అనువైన అంతర పంటలను సాగు చేసుకోవచ్చని, కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు అర్హతను బట్టి ఎకరాకు రూ.50,000 వరకు సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని, కాబట్టిరైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.

# మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు

## అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అలవర్చుకుంటూ మన చుట్టూ ఉన్న ఎవరూ మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు లేదా చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు.ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం,కుటుంబం,సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు.డ్రగ్స్



విక్రయం,కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రగ్స్ విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పోలీసు శాఖ,ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ,విద్యాశాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్టిచ్చింగ్‌లో మెళకువలు వివరించిన మెప్మా పిడి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట, హుజురాబాద్ మెప్మా సంఘ సభ్యులు స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ చేయు కేంద్రాలను మెప్మా పీడీ స్వరూప రాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ యూనిఫాం కుట్టే కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. టైలర్‌లకు పలు సూచనలు చేస్తూ యూనిఫాం కట్టే ప్రతి టైలర్ 12 అంశాలైన సూత్రాలను దృష్టిలో ఉంచుకొని పిల్లలకు నాణ్యమైన యూనిఫాం కుట్టి అందించాలన్నారు. నేడు వెల్ఫేర్ పాఠశాలలో యూనిఫాం అందించాలని ఆగస్టు నెల 10వతేదీ వరకు స్కూల్ పిల్లలకు యూనిఫాంలు ఇవ్వాలని పీడీ ఆదేశించారు. ఆర్పీ ఓబిల రివ్యూ సమావేశానికి మెప్మా పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బిఎల్‌వో వర్క్ లేని ఆర్పీలు, ఓబిలతో మెప్మా కార్యక్రమాలు బ్యాంక్ లింకేజ్, కొత్త సంఘాల ఏర్పాటు, చీరల పంపిణీ, సంఘ సభ్యుల ఆధార్ సీడింగ్ వంటి అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించగా వారం రోజుల వ్యవధిలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ఆర్పీలు తెలిపారు. మళ్లీ నిర్వహించే ప్రత్యేక సమావేశం వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని ఆర్పీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెప్మా డిఎం సి.శ్రీవాణి, టిఎల్ఎఫ్ ఓబీలు గీత, జ్యోతి, సిఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల, విజయ, అబేదబాను, మాలతి, సంధ్య, ఉమ, శిరిష, శ్రీదేవి, శ్రీలతలతోపాటు పలువురు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో 38 అంశాలు ఏకగ్రీవ తీర్మానం

**ప్రజాపక్షం / జమ్మికుంట :** మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కమీషనర్ గుట్టల మల్లిఖార్జున స్వామి కౌన్సిల్ ముందు 38 అంశాలు ప్రవేశపెట్టారు. మున్సిపల్ కార్యాలయంలో వెహికల్ రిపేరు, శ్రీరామ హాస్పిటల్ నుంచి హోటల్ నరసయ్య ఇంటి వరకు డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం, రానున్న వినాయక చవిత వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయుట, క్రేన్లు కిరాయి తీసుకకోవడం జనరేటర్, టెంట్ స్టేజ్, రోడ్లపై గుంతలు పూడ్చుడం, మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఇంటర్ ఫోన్ కనెక్షన్స్, టీవీ ఏర్పాటు చేయుటకు గాంధీ చౌక్ జాతీయ జెండా పోల్ మరమ్మత్తులు చేసి జెండా ఆవిష్కరణ చేయడం గాను లక్ష రూపాయలు కౌన్సిల్ ఆమోదం. వీధి దీపాల కోసం పిసిపిఎస్ సెన్సార్లు డైవర్స్ ఎల్ఈడీ లైట్లు, వీధీ దీపాల సామాను కొనుగోలు కోసం రూ.10 లక్షలు, డెవలప్‌మెంట్ మొక్కలు కొనుగోలు చేయడం కోసం, డ్రైనేజీ నిర్మాణం మొత్తం 38 అంశాలు కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశానికి వైస్ చైర్మన్ జావిద్, మున్సిపల్ కౌన్సిలర్లు, మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలను సత్వర పరిష్కారం



**ప్రజాపక్షం/అంతర్గాం :** రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని, భూ రీసర్వేను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, కుటుంబ రిజిష్టర్ ధ్రువపత్రాల జారీకి ప్రాధాన్యత ఇవ్వాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రామగుండం తహసీల్ కార్యాలయాన్ని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతర్గాం తహసీల్దారు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# 44 కేసులలో 66 మంది నిందితులకు జైలు శిక్షలు: ఎస్‌పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గడిచిన ఆరు నెలల కాలంలో 44 కేసుల్లో 66 మంది నిందితులకు జైలు శిక్షలు, 05 హత్య కేసుల్లో 19 మంది నిందితులకు జీవిత ఖైదు విధించడం విశేషమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పలు కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన అధికారులకు, సిబ్బందిని అభినందించి ప్రశంస పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్ఠమైన సాక్ష్యాధారాల సేకరణ, వేగవంతమైన విచారణతో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. నిందితులకు శిక్షలు పడటంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర అత్యంత కీలకమని,పోలీసు అధికారులు,



పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమన్వయంతో పని చేస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. గడచిన ఆరు నెలల కాలంలో పలు క్రిమినల్ కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించయని,ముఖ్యంగా హత్య, పోక్సో, హత్యాయత్నం, దోపిడీ, చోరీ తదితర కేసుల్లో పకడ్బందీగా త్వరగతిన దర్యాప్తు నిర్వహించి, సాక్ష్యాలను కోర్టులో సమర్పించడం వల్ల శిక్షల శాతం పెరిగాయని, ఇదే ఉత్సహంతో ప్రతిఒక్కరు పని చేయాలని సూచించారు.పోలీసు అధికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రతి కేసును బాధ్యతాయుతంగా విచారించాలని,ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం దర్యాప్తులో అత్యంత కీలకమైందని, ప్రతి కేసులో శాస్త్రీయ ఆధారాలను తప్పనిసరిగా సేకరించి కోర్టులో సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, కోర్టు మానిటరింగ్ ఎస్.ఐలు రవీంద్రనాయుడు, శ్రావణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు

యశోద హాస్పిటల్స్ ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** క్యాన్సర్ మహమ్మారిపై పోరులో వైద్య రంగం మరో మైలు రాయిని దాటిందని,సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక హైపర్ సైట్ రేడియేషన్ థెరపీ అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాప్తికి కారణాలు,ఆధునిక చికిత్స విధానాలపై వివరాలను వెల్లడించారు.సమాజంలో క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని,దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవనశైలి అని ఆమె పేర్కొన్నారు.పొగాకు నమలడం, ధూమపానం,కారమైన ఆహారాలు,కలుషిత మైన తిండి,వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల 70 నుంచి 80 శాతం క్యాన్సర్లు వస్తున్నాయని తెలిపారు.కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే జన్యు పరంగా కుటుంబంలో ఎవరికైనా ఉంటే వస్తాయని స్పష్టం చేశారు.క్యాన్సర్ చికిత్సలో సర్జరీ,కీమోథెరపీ,రేడియేషన్ థెరపీ,ఇమ్యునోథెరపీ వంటి పద్ధతులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ స్రవంతి తెలిపారు.అయితే ట్రీట్మెంట్ సమయంలో వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ వల్ల రోగులు మానసికంగా కుంగిపోకుండా,ఈ కొత్త అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ద్వారా సైడ్ ఎఫెక్ట్స్‌ను 50 నుంచి 60 శాతం వరకు తగ్గించవచ్చునని వెల్లడించారు.ప్రతిరోజూ ట్రీట్మెంట్ సమయంలో గడ్డ సైజులో వచ్చే మార్పులను,చుట్టుపక్కల ఉండే ఆర్గాన్స్ కదలికలను ఈ మిషన్ స్పష్టంగా గుర్తిస్తుందని,దీనివల్ల ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిలకుండా నేరుగా కణితిపైనే కచ్చితమైన రేడియేషన్ ఇవ్వవచ్చని,ఊపిరితిత్తులు లేదా ఛాతి భాగంలో శ్వాస తీసుకోవడం వల్ల కదిలే కణితులను కూడా బ్రీతింగ్ సైకిల్ ట్రాకింగ్ ద్వారా కచ్చితంగా గుర్తించి చికిత్స అందించవచ్చని తెలిపారు.సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ తీసుకువచ్చిన ఈ హైపర్ సైట్ మిషన్ ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీలో ఒక విప్లవాత్మక మార్పు అని డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు.క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రాణాలను కాపాడుకోవాలని చేసుకోవాలని ఆమె తెలిపారు.ఈ సమావేశంలో పిఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు రైన్‌కోట్ల పంపిణీ

**ప్రజాపక్షం/ధర్మపురి :** భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ పారిశుధ్య నిర్వహణలో నిరంతరం విధులు నిర్వర్తిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న పురపాలక సంఘ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని,ధర్మపురి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పారిశుధ్య కార్మికులకు రైన్‌కోట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు ఎంత తీవ్రంగా ఉన్నా పారిశుధ్య కార్మికులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం సేవలు అందిస్తున్నారని,వారి ఆరోగ్యం, భద్రతకు మున్సిపల్ పాలకవర్గం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ధర్మపురి పట్టణ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే మున్సిపల్ శాఖ హెల్ప్‌లైన్ (9676745601, 6301086505) నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపడతారని తెలిపారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న ,మున్సిపల్ అధికారులు,సానిటరి ఇన్స్పెక్టర్ గంగాధర్, మేనేజర్ గంగాధర్,ప్రజా ప్రతినిధులు,సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో సేవలందించడం అభినందనీయం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో చంద్రయ్య సేవలందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చంద్రయ్య ఉద్యోగ విరమణ పురస్కరించుకొని ఘనంగా వీడ్కోలు,సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అదనపు ఎస్పీ చంద్రయ్య అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నాగేంద్ర చారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు,సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, ఏ. ఓ, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధే ధ్యేయం

మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని 25 అంశాలతో కూడిన ఎజెండాను ఈ మున్సిపల్ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా మున్సిపల్ పాలకవర్గ సభ్యుల ఆమోదంతో 24 అంశాలను ఆమోదించుకోవడం జరిగిందని సిరిసిల్ల మున్సిపల్‌చైర్మన్ జిందం కళచక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాబోయే వినాయక చవితిని దృష్టిలో పెట్టుకుని నిమజ్జనం సందర్భంగా మున్సిపల్ చేపట్టవలసిన వివిధ పనుల కోసం దాదాపు 20 లక్షల రూపాయలను కేటాయించుకోవడం జరిగిందన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా స్ప్రేయింగ్ మెషిన్ల కొనుగోలు కు దోమల నివారణకై కెమికల్స్ కొనుగోలుకు ఫాగింగ్ మిషన్ల మరమ్మతులకు, విధి నిర్వహణలో భాగంగా పారిశుధ్య కార్మికులకు హ్యాండ్ గ్లాస్ కొనుగోలు చేయుటకు నిధులను కేటాయించుకోవడం జరిగిందని అన్నారు. పవర్ బోర్ల చుట్టూ ఇంకుడు గుంతలు నిర్మించాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదిర్ ఫాషా ,వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ విప్ బుర్ర మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఉదారతను చాటుకున్న కిరాణా వర్తక వ్యాపారి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** వివి రావు పేట గ్రామానికి చెందిన వ్యక్తి 10 గ్రాముల బంగారం పోగొట్టుకోగా తనకు దొరికిన బంగారాన్ని పోగొట్టుకున్న వ్యక్తికి ఇచ్చి ఉదారతను చాటుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన కిరాణా వర్తక వ్యాపారి కస్తూరి సంతోష్. వివి రావు పేట గ్రామానికి చెందిన తోట పెద్దరాజరెడ్డి సంతోష్ కిరాణంలో 10 గ్రాముల బంగారాన్ని మర్చిపోగా గుర్తించిన వర్తక వ్యాపారి సంతోష్ బాధితునికి ఫోన్ చేసి దుకాణంలో మర్చిపోయిన బంగారాన్ని తిరిగి అప్పజెప్పాడు. పోయిన బంగారం దొరుకుడే గగనం అనుకునే రోజుల్లో షాపులో మర్చిపోయిన బంగారాన్ని తిరిగి బాధితునికి అందించడం ఎంతో అభినందనీయమని సంతోష్ ను గ్రామస్తులు అభినందించారు.

# 2ఎ ఇంక్లైన్ అండర్ బ్రిడ్జి కాలువ ఆధునీకరణ

జి.ఎం. లలిత్ కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి రామగుండం వన్ ఏరియాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక ఉదయ్ నగర్, 2ఎ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాలను శుక్రవారం ఆర్జీ వన్ జి.ఎం. లలిత్ కుమార్,సివిల్ డి.జి.ఎం వరప్రసాద్, గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ తో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. 2ఎ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువలో వరద ప్రవాహాన్ని, క్వార్టర్లలో మురికి నీరు,వరద నీరు బయటకు వెళ్ళక నివాసాల్లో ఉండడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయని అన్నారు.ఈ సందర్భంగా జి.ఎం. లలిత్ కుమార్ మాట్లాడుతూ 2ఎ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువను ఆధునీకరణ పనులు చేపడతామని, కంపెనీ క్వార్టర్ల లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు.సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ ఆర్జీ వన్ పరిధిలోని క్వార్టర్ల డ్రైనేజీ వ్యవస్థ గత 30 సంవత్సరాల క్రితం నిర్మించబడిందని, పందికొక్కులు తోడడంతో పైపులు పూర్తిగా పగిలి మురికి బయటకు వస్తుందని,దీని వల్ల దుర్వాసనతో కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే సింగరేణి యాజమాన్యం 2ఎ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువ నిర్మాణంతో పాటు సెక్టార్1, సెక్టార్2 క్వార్టర్లలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి,కార్మిక కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని కోరడం జరిగిందని అన్నారు. ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

# ఆషాఢమాస బోనాల జాతర

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణంలోని పురాణిపేట ఆంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ళు, నృత్యాల మధ్య ఘనంగా ఆషాఢ మాస బోనాల పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ప్రతి యేడు లాగే ఆషాఢ మాసంలో అమ్మకు ప్రీతి కరమైన శుక్రవారం రోజున పురాణిపేట ఆంజనేయ దేవాలయంలో అమ్మ వారికి భక్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుక జరుపుతూ వస్తున్నామని, ఎలినినో ప్రభావం పూర్తిగా తొలగి వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.తదనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో పురాణిపేట వాసులు ఉన్నారు.

# పత్తి పంటలో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలి

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా మండలంలోని ముత్తారం, మైదంబండ, మచ్చుపేట గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పత్తి క్షేత్రాలను విస్తృతంగా సందర్శించారు.గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పంటల పరిస్థితిని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి,రైతులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జే. అనూష మాట్లాడుతూ వర్షాల వల్ల పత్తి చేన్లలో నిలిచిన నీటిని వెంటనే కాల్వల ద్వారా బయటికి పంపించాలని రైతులకు సూచించారు. చేన్లలో నీరు నిల్వ ఉండటం వల్ల వేరుకుళ్ళు తెగులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు.నీరు నిలిచిన చోట వేరుకుళ్ళు రాకుండా ఉండేందుకు కాపర్ ఆక్సిక్లోరైడ్ తో డ్రెంచింగ్ చేయాలని,అలాగే మొక్కల బలానికి 191919 ఎరువును స్ప్రే చేయాలని కోరారు.అదేవిధంగా, ఆకు రసం పీల్చే పురుగు ఆశించిన చేన్లలో నివారణకు గాను మోనోక్రోటోఫాస్ మందును 1:4 నిష్పత్తిలో (కాండానికి పూత లేదా స్ప్రే) వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కె. మనీషా, బి.శశిధర్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

# కేంద్రియ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్‌లోని పాత ఎస్పీ కార్యాలయ భవనంలో తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి బాలవాటిక–1 (నర్సరీ) నుంచి ఐదవ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 1, 2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 14, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.40 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. పూర్తిగా నింపిన దరఖాస్తు పత్రాలను అవసరమైన ధ్రువపత్రాలతో పాటు కేంద్రీయ విద్యాలయం, చల్ గల్ తాత్కాలిక క్యాంపస్, పాత ఎస్పీ కార్యాలయ భవనం, ధరూర్ క్యాంప్, జగిత్యాల చిరునామాలో సమర్పించాలని సూచించారు. బాలవాటిక–1, బాలవాటిక–2, బాలవాటిక–3, ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఆయా తరగతుల్లో ఉన్న ఖాళీలకు మాత్రమే ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రవేశాలకు కేంద్రీయ విద్యాలయ సంస్థ ప్రవేశ మార్గదర్శకాలు–2026–27లో నిర్దేశించిన వయోపరిమితి, అర్హతలు, నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రేషన్ కార్డు/బీపీఎల్/ఆదాయ ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవా ధృవీకరణ పత్రం, బదిలీ వివరాలు, అలాగే కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ఇతర పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. ప్రవేశ ప్రక్రియ పూర్తిగా కేంద్రీయ విద్యాలయ సంస్థ ప్రవేశ మార్గదర్శకాలు 2026–27కు అనుగుణంగానే నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయాన్ని లేదా కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశ మార్గదర్శకాలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సూచించారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల

ఆర్‌డిఒకు బిసియువజన సంఘం వినతి

**ప్రజాపక్షం /కోరుట్ల :** విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు,పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని కోరుతూబిసి యువజన సంఘం ఆధ్వర్యంలో కోరుట్ల ఆర్డీవో ఎల్. జీవాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.జాతీయబిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య,బిసి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షులు నీలం వెంకటేష్ సంయుక్త పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగాబిసి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి షికారి గోపికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను జిల్లా, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు.14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ.8,000 కోట్ల ఫీజు బకాయిలను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని, కొత్త విధానాలతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు.విద్యార్థుల హక్కు విద్య – ఫీజు రీయింబర్స్‌మెంట్ మా హక్కు" అని నినదిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా తక్షణమే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోబిసి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ ,సీనియర్ నాయకులు నిమ్మల రంజిత్ కుమార్, సురేందర్ , పట్టణ అధ్యక్షులు ఏనుగందుల తిరుపతి ,తదితరులు పాల్గొన్నారు.

# లీకేజీ నివారణకు తక్షణ చర్యలు



**ప్రజాపక్షం / వాంకిడి :** సరాండి గ్రామపంచాయతీ పరిధిలో బోర్వెల్ గేట్ వాల్ లీకేజీని స్థానిక సర్పంచ్ మొహర్లే బాపూజీ వెంటనే స్పందించి పునరుద్ధరించారు. మండలంలోని సరాండిలో గేట్ వాల్ వద్ద లీకేజీ ఏర్పడటంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ తక్షణమే స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సోనాంతో కలిసి లీకేజీ మరమ్మత్తు పనులను పర్యవేక్షించారు. దెబ్బతిన్న రబ్బర్ గాస్కెట్‌ను తొలగించి నూతన గాస్కెట్‌ను అమర్చడంతో సమస్య పరిష్కారమైంది. ప్రజలకు తాగునీటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్న సర్పంచ్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం / మందమర్రి :** అకాల మరణం చెందిన గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ వేల్పుల శ్రీను తండ్రి దుర్గయ్య కుటుంబానికి స్థానిక సర్పంచ్ పెంచాల మధు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన దుర్గయ్య శుక్రవారం మృతి చెందారు. కడు నిరుపేద కుటుంబమైన విషయం తెలుసుకున్న సర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి హరీష్‌తో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సర్పంచ్ తన సొంత నిధుల నుంచి ఐదు వేల రూపాయలను వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చేయూత రోల్ బ్యాక్ బీడీ పింఛన్ల పంపిణీ

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని పల్లె గ్రామంలో ఆగిపోయిన ముగ్గురికి రోల్‌బ్యాక్ బీడీ పింఛన్లు రెండు చేయూత పింఛన్లను నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మండల అధ్యక్షులు సూరకంటి చిన్నారెడ్డి సమక్షంలో సర్పంచ్ పార్దేమ మనీషా సంజీవ్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్క రంజిత్‌కుమార్ చేతుల మీదుగాశుక్రవారం లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ జె.గంగాధర్, శ్రీనివాస్, పోశెట్టి, సుధాకర్, నరేష్, భూమేష్, భోజేందర్ పాల్గొన్నారు.



# భారీ వర్షాలకు ఆర్ అండ్ బి వంతెన వద్ద గండి



**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఆర్ అండ్ బి వంతెన ఒక వైపున భారీ రంధ్రం పడింది. వర్షపు నీటి ఉధృతికి వంతెన పక్కభాగం కోతకు గురికావడంతో పెద్ద గండి ఏర్పడి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. నిత్యం వాహనాల రాకపోకలు సాగే ఈ మార్గంలో పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఆర్ అండ్ బి శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ క్రాంతికుమార్ స్పందిస్తూ వంతెన వద్ద ఏర్పడిన సమస్యను పరిశీలించి అత్యవసరంగా మరమ్మతు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# బ్రిడ్జ్‌ను పరిశీలించిన కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** సిర్పూర్ మండలంలోని వెంకట్రావుపేట వద్ద ఉన్న ప్రాణహిత పెన్‌గంగా బ్రిడ్జ్‌ను జిల్లా కలెక్టర్ కె.హరిత శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నదిలో నీటి ప్రవాహ పరిస్థితిని, బ్రిడ్జ్ వద్ద భద్రతా ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా నదీ తీరం వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా ఓవర్ లోడ్ వాహనాల రాకపోకల వల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓవర్ లోడ్ నివారణకు ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను ఎవరు తొలగించారో ఆరా తీశారు. నీటి ప్రవాహం వైపు ప్రజలు వెళ్లకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాల రాకపోకలపై నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

## ఎంపిడిఓ శ్రీనివాస్



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను, భోజనం నాణ్యతను, మెనూను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ పాఠశాల వాతావరణంలో పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈ తనిఖీలో మండల విద్యా శాఖ అధికారి రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, గ్రామ సర్పంచ్ భక్తు రాంచందర్, గ్రామ కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

## డయాలసిస్ బెడ్ల ప్రారంభించిన : ఎంఎల్‌సి దండే, ఎమ్మెల్యే పాల్వాయి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు డయాలసిస్ బెడ్లను ఎంఎల్‌సి దండే విఠల్, ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని ఎల్లగౌడ్ తోటలోని ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి దండే విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇతర జిల్లాలకు వెళ్లకుండా స్థానికంగానే అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ అత్యవసరమని, బెడ్ల సంఖ్య పెరగడంతో ఎక్కువ మందికి సమయానికి చికిత్స అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అవినాష్, వైద్యులు హర్ష, అరుణ్, నందిని, రమ్య, కావ్య, ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కుల దూషణ ఆరోపణలు.. దళితుల నిరసన



**ప్రజాపక్షం / వాంకిడి :** కుల దూషణలు జరిగాయంటూ దళితులు నిర్వహించిన నిరసనతో వాంకిడి మండలంలోని బంబారా గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎంబిఆర్పిఎస్ నాయకుడు పొన్నాల నారాయణ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు, చిన్నారులతో కలిసి గ్రామ ప్రధాన రహదారిపై బైఠాయించి డప్పులతో ఆందోళన చేపట్టారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

## దేవాపూర్ ఎస్ఐ గంగారం



**ప్రజాపక్షం/కాసిపేట :** నేరాల నియంత్రణ, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు దోహదపడతాయని దేవాపూర్ ఎస్ఐ గంగారం తెలిపారు. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగులగూడ గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. అనంతరం గ్రామస్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అపరిచితుల నుంచి వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరికి చెప్పకూడదని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం సమాజానికి హానికరమని, యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. నేరాల అదుపునకు, భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు గండి పూడ్చివేత



**ప్రజాపక్షం / కౌటాల :** చింతల చెరువుకు పడిన గండిని స్థానిక సర్పంచ్ కత్మార్ మౌనిక అనిల్ వెంటనే పూడ్చివేయించారు. మండలంలోని తాటినగర్ గ్రామంలో శుక్రవారం చింతల చెరువుకు గండి పడడంతో నీరు ఉధృతంగా బయటకు ప్రవహించింది. గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న సర్పంచ్ తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చెరువు నీరు బయటకు పోయి గ్రామానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అత్యవసరంగా గండిని పూడ్చే చర్యలు చేపట్టారు. సమయానికి స్పందించి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం / కాసిపేట :** సింగరేణిలో 38 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్డిఎల్ ఆపరేటర్ మినుగు లక్ష్మీనారాయణ శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని కాసిపేట గని మేనేజర్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ ఆకాంక్షించారు. శుక్రవారం కాసిపేట 1వ గనిపై ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. లక్ష్మీనారాయణ 1988లో ఎస్ఎంజి 1వ గనిలో బదిలీ ఫిల్లర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి, ఎస్డిఎల్ ఆపరేటర్‌గా పదోన్నతి పొందారని తెలిపారు. 16 ఏళ్లు అక్కడ సేవలు అందించిన అనంతరం కాసిపేట గనిలో 23 ఏళ్లు వివాదరహితుడిగా, తోటి కార్మికులతో కుటుంబ సభ్యుడిలా మెలుగుతూ సేవలందించారని కొనియాడారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. వివిధ శాఖల అధికారులు, యూనియన్ నాయకులు, తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# చాకిరీ ఏమో అపరిమితం.. జీతమేమో అరకొరం

## నిర్మల్ జిల్లాలో సెకండ్ ఏఎన్ఎంల ఆక్రందన!

### 19 మండలాలు,16 పిహెచ్‌సిలు, 106 ఉప కేంద్రాల్లో పెరిగిన పనిభారం

### 15 వేల జనాభాకు ఒక్కరే దిక్కు..ప్రాణాలు పణంగా పెట్టినా దక్కని గుర్తింపు

### రాత పరీక్షలు లేకుండా తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని నిలదీత



**ప్రజాపక్షం/నిర్మల్ :** చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తూ, ఎంత శ్రమించినా దక్కని గుర్తింపుతో నిర్మల్ జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎం (యాక్సిలరీ నర్స్ మిడ్‌వైఫ్) ల బతుకులు అత్యంత దయనీయంగా మారాయి. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద దశాబ్ద కాలానికి పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వైద్య ఆరోగ్య శాఖలో అత్యంత కీలకమైన సేవా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ వారి జీవితాల్లో వెలుగులు నిండడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ పోషణ ఖర్చులు ఆకాశాన్నంటుతున్న నేటి కాలంలో అరకొర వేతనాలతో బతుకు బండిని ఈదడం వారికి అత్యంత శక్తివంచనగా మారింది. క్షేత్రస్థాయిలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న తమ పట్ల ప్రభుత్వాలు చూపుతున్న చులకన వైఖరిపై వారు తీవ్ర ఆగ్రహం మరియు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 మండలాల పరిధిలో మొత్తం 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి) మరియు 106 ఉప ఆరోగ్య కేంద్రాలు (సిబి) కొలువై ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 82 మంది సెకండ్ ఏఎన్ఎం ఉన్నారు.ఈ కేంద్రాల ద్వారా గ్రామీణ పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఈ సెకండ్ ఏఎన్ఎంలే ప్రధాన దిక్కుగా నిలుస్తున్నారు. ప్రభుత్వ అధికారిక నిబంధనల ప్రకారం ప్రతీ 5,000 మంది జనాభాకు ఒక ఏఎన్ఎం అందుబాటులో ఉండి ఆరోగ్య సేవలు అందించాల్సి ఉంది. కానీ నిర్మల్ జిల్లాలో క్షేత్రస్థాయి పరిస్థితులు దానికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం ఒక్కో ఏఎన్ఎం పరిధిలో ఏకంగా 13,000 నుండి 15,000 మంది వరకు జనాభా సేవా పరిధిలోకి వస్తోంది. దీంతో నిబంధనలకు మించిన జనాభాకు సేవలందించాల్సి రావడం వల్ల వారిపై పనిభారం మూడు రెట్లు పెరిగి, మానసికంగా, శారీరకంగా తీవ్ర ఒత్తిడికి గురై తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు.గ్రామాలలో గర్భిణులు, బాలింతల వివరాలు సేకరించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, నవజాత శిశువుల నుండి ఐదేళ్ల పిల్లల వరకు క్రమం తప్పకుండా అన్ని రకాల టీకాలు వేయడం, వర్షాకాలంలో వ్యాపించే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం మరియు వ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన వైద్య పరీక్షలు నిర్వహించడం వంటి ప్రాథమిక బాధ్యతలను వీరే స్వయంగా నిర్వహిస్తున్నారు. కేవలం క్షేత్రస్థాయి వైద్య సేవలందించడమే కాకుండా, రోజువారీ నివేదికలను భౌతికంగా రిజిస్టర్లలో నమోదు చేయడంతో పాటు సాయంత్రం వేళల్లో ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో డేటా ఎంట్రీ చేయాల్సి రావడం అదనపు భారంగా మారింది. దీనికితోడు పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు శారీరక తనిఖీలు చేయడం, టెన్త్ మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద ప్రత్యేక విధులకు హాజరుకావడం వంటి అనేక బాధ్యతలను వీరిపై రుద్దుతున్నారు.గతంలో ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి విజృంభించిన తీవ్ర విపత్కర సమయంలో సెకండ్ ఏఎన్ఎంలు అందించిన అమూల్యమైన సేవలు వర్ణనాతీతం. తమ సొంత ప్రాణాలను, కుటుంబాల భద్రతను సైతం లెక్కచేయకుండా గ్రామ గ్రామాన ఇ ఇంటికీ తిరుగుతూ కోవిడ్ లక్షణాలు ఉన్నవారిని సకాలంలో గుర్తించడం,నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం మరియు బాధితులకు అవసరమైన మందుల కిట్లు అందజేయడంలో వీరు రాత్రింబవళ్లు శ్రమించారు.అలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో సైతం వెనుకంజ వేయక సేవలందించిన తమను ప్రభుత్వాలు తగిన రీతిలో గుర్తించకపోవడం తమను తీవ్ర మనస్తాపానికి గురిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం, ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం గతంలో అనేక మార్లు ధర్నాలు, నిరసనలు, సమ్మెలు నిర్వహించినప్పటికీ, పాలకులు కేవలం తాత్కాలిక హామీలకే పరిమితమయ్యారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రజా ప్రభుత్వం స్పందించి, జిల్లాలోని 19 మండలాల పరిధిలో పనిచేస్తున్న తమ క్షేత్రస్థాయి కష్టాలను మరియు సుదీర్ఘ సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎటువంటి అదనపు నిబంధనలు లేదా ప్రత్యేక రాత పరీక్షలు విధించకుండా తమ సేవలను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి తమ కుటుంబాలకు ఆర్థిక ఆసరా అందించాలని నిర్మల్ జిల్లా సెకండ్ ఏఎన్ఎంల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## డబ్బులు వసూలు చేసిన దాడిలో ఒకరి అరెస్ట్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం పోలీసులు డబ్బు వసూళ్ల (ఎక్స్‌టార్షన్) మరియు దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్ఐ ప్రదీప్ మరియు సిబ్బంది ఎస్సై వివరాల ప్రకారం లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 88/2026, భారతీయ న్యాయ సంహిత ( భైంసా ) సెక్షన్లు 118(2), 324(4), 308(2) కింద నమోదైన కేసులో రాజూర గ్రామం,లోకేశ్వరం మండలం నివాసి పల్లె సన్నిత్ అలియాస్ సన్నీ అలియాస్ సందీప్ (31 సంవత్సరాలు),తండ్రి నడిపి పోశెట్టిను లోకేశ్వరం పోలీసులు అరెస్ట్ చేశారు.ఫిర్యాదుదారుని నుండి డబ్బు బలవంతంగా వసూలు చేసి,అతనిపై దాడి చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో నిందితుడిని 31072026 తేదీన అరెస్ట్ చేసి, గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా,న్యాయస్థానం న్యాయ నిర్బంధానికి ( జుడిషియల్ కస్టడీ).రిమాండ్ విధించింది.అనంతరం అతడిని ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు.కేసు దర్యాప్తు కొనసాగుతోంది.లోకేశ్వరం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది ఏమనగా, ఎవరూ డబ్బు వసూళ్లు (ఎక్స్‌టార్షన్),దాడులు, బెదిరింపులు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనరాదు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

## భైంసా మున్సిపల్ కార్మికులకు డ్రెస్సులు,గ్లౌజుల పంపిణీ

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు డ్రెస్ కిట్ ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ ,మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలో మున్సిపల్ కార్మికుల సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు వారు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తు వైస్ చైర్మన్,మున్సిపల్ కౌన్సిలర్లు,అధికారులు, ప్రజాప్రతినిధులు,కార్మికులు పాల్గొన్నారు.

## సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్

**ప్రజాపక్షం/భైంసా :** సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భైంసా పట్టణంలో ఎస్ ఎస్ ఫ్యాక్టరీ నందు నిర్వహించిన కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పర్యటనలో భాగంగా నగర కార్యవర్గ సమావేశం, శక్తి కేంద్ర ప్రభారీలు,పదాధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సర్ కార్యక్రమం అమలు,సంస్థాగత బలోపేతం,కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ప్రవాసి కార్యకర్తగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్,బిజెపి టౌన్ అధ్యక్షులు రావుల రాము పాల్గొన్నారు.

## ముమ్మరంగా డ్రై డే, పారిశుద్ధ్య పనులు

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** మోసమిక్ వ్యాధులు, సీజనల్ జ్వరాలు వ్యాపించకుండా నివారించడమే లక్ష్యంగా దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం రోజున డ్రై డే కార్యక్రమంతో పాటు ముమ్మర పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి గోవర్ధన్ ప్రత్యక్షంగా పాల్గొని,పంచాయతీ సిబ్బంది చేపడుతున్న పారిశుధ్య చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంతో పాటు గ్రామంలోని వీధులు, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. నిల్వ ఉన్న నీటి ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు.ఇళ్లు,ఆస్పత్రులు పభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పాత టైర్లు, నీరు నిల్వ ఉండకుండా ప్రతి వారం డ్రై డే పాటించి పాత నీటిని పారబోయాలని కోరారు.

## సంస్కృతి — సంప్రదాయం — ఆరోగ్యం గోరింటాకుతో వినూత్న అవగాహన



**ప్రజా పక్షం/భైంసా :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే లక్ష్యంతో గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసాలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసంలో గోర్గింటాకు విశిష్టత – ఆరోగ్యం, సంస్కృతి, సంప్రదాయం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు,అధ్యాపకులు కలిసి సహజసిద్ధంగా లభించే గోరింటాకు ఆకులను సేకరించి, సంప్రదాయ పద్ధతిలో మెహందీ తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు.గోరింటాకు కేవలం అలంకరణకు మాత్రమే కాకుండా ఆరోగ్య పరిరక్షణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులకు వివరించారు.కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం భారతీయ సంస్కృతిలో ఒక విశిష్ట సంప్రదాయమని తెలిపారు. వర్షాకాలంలో శరీరంలోని వేడిని సమతుల్యం చేయడం, చర్మానికి చల్లదనాన్ని అందించడం, కొన్ని చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడం వంటి ప్రయోజనాలు గోరింటాకుకు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రకృతి ప్రసాదాలను ఆదరించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు.ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డా. నహీదా గోరింటాకు తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించి, సహజసిద్ధమైన మెహందీని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జె. ఓంప్రకాశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను కళాశాలలో నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా. జె. భీమారావు, డా. శంకర్, డా. యు. రవికుమార్, శ్రీ ఆరె రాజు, డా. సంతోష్ కుమార్, శ్రవణ్య, డా. కల్పన , దివ్య, సురేందర్, ముత్యం, మజర్, అర్షియ , ఉజుమా, తదితర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ–విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి అరుదైన గౌరవం



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. నరేందర్ రెడ్డికి యునైటెడ్ కింగ్‌డమ్ సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధానం చేయడం వల్ల ప్రతిష్టాత్మక్ లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అరుదైన గౌరవం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ప్రతి సందర్భంలో విజయాలను లక్ష్యంగా చేసుకొని నిరంతరం శ్రమిస్తే సమాజంలో విశిష్ట గుర్తింపు గౌరవం లభిస్తుందన్నారు. గత 36 సంవత్సరాలుగా ఆల్ఫోర్స్ విద్యా రంగానికి విశిష్ట సేవలందిస్తూ అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతోందని తెలిపారు. సామాజిక సేవల పట్ల అంకిత భావాన్ని గుర్తించి ఈ సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధానం చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలు సేవా సంస్థలు, యువజన సంఘాలు, విద్యావేత్తలు, శిక్షణ నిపుణులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, క్రీడా సంఘాలు తదితర ప్రజా ప్రతినిధులు నరేందర్ రెడ్డిని శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని రేండ్లపల్లి గ్రామంలోగత15సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన మాడవి లలితకోశేరావు దంపతులను గ్రామస్తులు, గ్రామపంచాయతీ సర్పంచ్ అడపనవీన్ కుమార్‌ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది పంద్రం శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా, ఆరోగ్య సమస్యలు వెంటాడినా కోశేరావు మాస్టారు తన వృత్తిని దైవంగా భావించి విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యాబుద్ధులు నేర్పించారని తెలిపారు.నేను ఈ స్థాయిలో ఉండడానికి కోశేరావు ముఖ్య మార్గదర్శకులు అని పేర్కొన్నారు.వారు విద్యార్థుల అభ్యున్నతికి, గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు ప్రశంసించారు.ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు,ప్లేట్లు,వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.అనంతరం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారుపూజారి సిడం జంగు,మహాజన్ రాయి సిడం కోశేరావు,రోహిదాస్,బీర్షవ్,మధుకర్ మరియు గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచి ఔదార్యం.. విద్యార్థినిలకు సాయం!

**ప్రజాపక్షం/అంతర్గాం :** అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం లోని విద్యార్థినిలకు గ్రామ సర్పంచి ఆరు ముళ్ల మాధవిమల్లేష్ శుక్రవారం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. అల్పాహారం, భోజనం చేసేందుకు సౌకర్యంగా విద్యార్థినిలకు ప్లేట్లు, గ్లాసులు అందజేయడం పట్ల సర్పంచి దంప తులను విద్యాలయం ఉపాధ్యాయునిలు, గ్రామ ప్రజలు అభినందించారు.

## సిఐ ఎస్ఐలను సన్మానించిన అంబేద్కర్ సంఘం నేతలు

12 గంటల్లో బాలసదనం బాలికలను కాపాడిన వైనం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఇటీవల సుల్తా నాబాద్ పట్టణంలోని బాలసదనం నుండి ఇద్దరు బాలికలు గోడ దూకి పారిపోయిన సంఘటన అందరికీ తెలిసిందే. అట్టి సంఘట నపై వెంటనే స్పందించి 12 గంటల లోపే నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఇద్దరు అదృశ్యమైన బాలికలను కాపాడినందుకు గాను సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు,ఎస్సై చంద్రకుమార్ కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, ఆది జాంబవ అరుంధతి రాష్ట్ర నేత కోటగిరి పాపయ్య, అంబేద్కర్ సంఘం సీనియర్ నేత సుద్దాల మాజీ ఎంపీటీసీ సభ్యులు సంకెనపల్లి లక్ష్మయ్య, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు,క్యాదాసి చంద్ర మౌళి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కల్వల శ్రీనివాస్, న్యాతరి శ్రీని వాస్,మాజీ వార్డు సభ్యులు ఆరేపల్లి ఇలా రావు,తదితరులు సన్మాన కార్యక్రమం లో పాల్గొన్నారు.

## పర్సనల్ మేనేజర్గా తిరుపతి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం సింగరేణి ఆర్జి1 ఏరియా పర్సనల్ మేనేజ ర్గా రెడ్డిమల్ల తిరుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన అధికారికి జీఎం డి.లలిత్కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, యాజమాన్యం మధ్య ఉన్న సమన్వయాన్ని మరింత బలో పేతం చేయాలని ఆయన కోరారు. అదేవి ధంగా సంస్థ అభివృద్ధికి విశేష కృషిని అందిం చాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు వేణు, శ్రావణ్కుమార్, హనుమంతరావు, దేవాచారి, కార్యాలయ అధికారులు, ఉద్యో గులు నూతన పర్సనల్ మేనేజర్ను అభినం దించారు.

## చెట్టు కొమ్మల తొలగింపు కూలిన దుకాణం

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణం ముబారక్నగర్ వద్ద ప్రధాన రహదా రికి అనుకొని ఉన్న భారీ వృక్షం వర్షాలతో ఒకవైపు ఒరిగింది. దీంతో శుక్రవారం రామ గుండం నగరపాలక అధికారులు రోడ్డుపైకి ఒరిగిన చెట్టు కొమ్మలను తొలగించారు. కొమ్మల తొలగింపు పనులు చేపడ్తుండగా చెట్టు కింద ఉన్న క్షౌర దుకాణం రేకుల షెడ్డు పూర్తిగా కూలింది. తమ కుటుంబ జీవనోపా ధికి దుకాణమే ఆధారమని, తిరిగి రేకుల షెడ్డు నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కన్సింగ్ను బాధిత దుకాణ యాజమాని సమ్మెట తిరుపతి కోరుతున్నారు.

## ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవ ర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా గుగ్గిళ్ల ఎల్లయ్య, అధ్య క్షుడిగా గోపి రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా వరుణ్ బట్టు, ప్రధాన కార్యదర్శిగా దొనకంటి శ్రీను,కోశాధికారిగా రాజేష్,ఉప కోశాధికారిగా నర్రా మహేందర్, సంయుక్త కార్యదర్శిగా విమల్, సహాయ కార్యదర్శిగా ఫణీంద్ర,వర్కింగ్ ప్రెసిడెంట్గా సోల్లు నవీన్, కుటుంబ భరోసా ఇన్చార్జ్గా ఎలిగేటి మల్లేష్, కోర్ కమిటీ అధ్యక్షు డిగా కాశవేని నాగరాజు,కోర్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్,కొండ ప్రశాంత్, కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా దాసరి లక్ష్మణ్, సలహాదారులుగా గౌరీకర్ రాజు, పులి శ్రీనివాస్, పత్రి రమేష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు నిర్మల్ జిల్లా ఫోటో & వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. కొత్త నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందుతూ సభ్యుల సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందించాలని, ఖానాపూర్ మండల సంఘాన్ని ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సగ్గం వంశీ,జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నర్సయ్య, ప్రధాన కార్య దర్శి ఇసారపు నవీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతామణి శ్రీనివాస కృష్ణస్వామి, కుటుంబ భరోసా ఇన్చార్జ్ గంగాధర్,శ్రీకాంత్, సాయి రాజ్, సల్ల సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాసంలో రాజన్న దర్శనం కల్పించాలి



**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి సంఘ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభ సమయంలో శివరాత్రి లేదా సమ్మక్క–సా రలమ్మ జాతర నాటికి స్వామివారి దర్శనాలు పునరుద్ధరి స్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదని విమర్శిం చారు. కనీసం రాబోయే శ్రావణమాసంలోనైనా పట్టణ ప్రజ లకు, భక్తులకు రాజన్న దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతాప్ రామకృష్ణ మాట్లాడుతూ, ఆగమశాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా, ఆలయ శిఖరం కనిపించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. స్థానిక సమ స్యలను పట్టించుకోకుండా మంత్రులు కేవలం ప్రారంభోత్స వాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. శ్రావణ మాసం నాటికి దర్శనాలు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఈ విషయమై దేవస్థానం ఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు, కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, రేగుల రాజ్కుమార్, కోల కృష్ణస్వామి, పిన్నింటి హనుమంతులు, రేగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు శానిటేషన్, రెయిన్ కోట్స్ పంపిణీ

కంచర్ల గ్రామ సర్పంచ్ సామల్ల దేవరాజు



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని కంచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికు లకు సర్పంచ్ సామల్ల దేవరాజ్ ఆధ్వర్యంలో శానిటేషన్ వస్తువులతో పాటు వర్షపు కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం ఎండ, వాన, చలి అని చూడకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని, వారి ఆరోగ్యభద్రత మా బాధ్యత అని, ప్రభత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు గ్రామపంచాయతీ తరుపున కూడా వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. కిట్లు అందు కున్న కార్మికులు సర్పంచ్ దేవరాజుకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెన్నెల, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కార్మికులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల-వన్పల్లి బస్సును యాధావిధిగా నడపాలి

బిఎస్పి వీర్నపల్లి మండల అధ్యక్షుడు ప్రశాంత్

**ప్రజాపక్షం/వీర్నపల్లి :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నుండి ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల మీదుగా వన్పల్లి గ్రామానికి ప్రతిరోజు వేళ్లే సిరిసిల్లవన్పల్లి ఆర్టీసీ బస్సును యధావిధిగా నడపాలి అని బీఎస్పీ వీర్నపల్లి మండల అధ్యక్షులు గజ్జెల ప్రశాంత్ కోరారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బస్సు రూటు మార్చి దుమాల, అక్కపల్లి గ్రామాలకు అనుసంధానం చేస్తూ ఈ బస్సు వెళ్లడం వలన వీర్నపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. మహాలక్ష్మీ పథకం వలన ఆర్టీసీ బస్సుల్లో రద్దీ ఎక్కువై దూర ప్రాంతాల్లోకి వెళ్ళడం వల్ల ప్రయాణికులకు, వాహన చోద కులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. అవసరమైతే దుమాల, అక్కపల్లి గ్రామాలకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని సిరిసిల్లవన్పల్లి రూట్ బస్సును యాధావి ధిగా నడిచేటుట్టు ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవాలని ప్రశాంత్ డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబానికి రజిత ఫౌండేషన్ ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన ఉడుత సదానందం ఇటీవల అనారోగ్యంతో మరణిం చారు.ఈ నేపథ్యంలో శుక్రవారం వారి కుటుంబాన్ని పలువురు నాయకులు,ప్రముఖులు పరామ ర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనం తరం రజిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుం బానికి 25 కేజీల బియ్యం,నిత్యవసర సరుకులను మృతుడి కుమారుడు గణేష్ కి అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పోతి పెద్ది కిషన్ రెడ్డి,రజిత ఫౌండేషన్ ఆర్గనైజర్ మొగిలి శ్రీనివాస్ యాదవ్,వార్డు సభ్యులు కోలిపాక లక్ష్మి చంద్రయ్య,నరేడ్ల,షేరు స్వామి,బొమ్మిడి మల్లేష్,బిక్కి నేని సుధాకర్ రావు,నాగుల ఓదెలు,కట్టేకోల మల్లయ్య,కొలిపాక సమ్మయ్య,బోమ్మిడి సాయికుమార్ ఉన్నారు.



## ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాలు



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండ లంలోని పెంబట్ల గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం మహిళ అభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆద్వర్యంలో సెక్టార్ మీటింగ్ నిర్వ హించారు. ఈ సందర్బంగా ఆషాడ మాసం సందర్భంగా గోరిం టాకు సంబరాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలపాక రాధ రాజు, సిడిపివో వాణీశ్రీ, ఏసిడిపివో మౌనిక, సూపర్వైజర్లు లత,శైలజ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభ పురస్కారం అందుకున్న కామని లక్ష్మయ్య



**ప్రజాపక్షం /కోరుట్ల :** న్యూఢిల్లీ లోని ఆంధ్ర అసోసియేషన్ భవనం లో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ సి.నారాయణ రెడ్డి జయంతి వేడుకల కార్యక్రమంలో జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభ పురస్కారాన్ని కేంద్ర ఉక్కు గనుల భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు,శ్రీనివాస వర్మ చేతులమీ దుగా కోరుట్ల మండలం జోగిన్ పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల తెలుగు పండితులు కామని లక్ష్మయ్య అందుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు బీద మస్తాన్ రావు,బంగారు లక్ష్మణ్,మాగుంట శ్రీనివాసరెడ్డి,ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచనకర్త ఆకెళ్ళ విభీషణ శర్మ,జాతీయ సాహిత్య పరిషత్ కార్యనిర్వహక అధ్యక్షులు కేశిరాజు,రాంప్రసాద్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాభ్ ఉద్దంరాజు చైతన్య రాజు తుమ్మల పల్లి రామసత్యనారాయణ,వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొ న్నారు. అవార్డు అందుకున్న కామని లక్ష్మయ్య ను ప్రధానోపాధ్యా యులు అంబటి వెంకట్రాజం రచయితలు చెరుకు మహేశ్వర శర్మ,వాసరవేణి పర్శరాములు,ఉపాధ్యాయ సంఘం నాయ కులు,తదితరులు అభినందించారు.

## పక్షవాతం బాధితుడి వైద్యానికి రూ.1.27 లక్షలు సాయం



**ప్రజాపక్షం/ధర్మపురి :** షుగర్ సమస్యతో ఎడమ కాలు తొలగిం చడమే కాకుండా పక్షవాతం సోకి మంచానికే పరిమితమైన నిరుపేద బాధితుడికి వైద్య ఖర్చుల కోసం ఫేస్ బుక్ మిత్రులు రూ.1.27 లక్ష లు విరాళాలు అందించారు.ధర్మపురి పట్టణంలోని ఇందిరమ్మ కాల నీలో నివాసం ఉంటున్న నూగూరి సత్యనారాయణ గతంలో చిన్న హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు.షుగర్ వ్యాధి సోకడంతో 4 ఏళ్ల క్రితం ఒక కాలు తొలగించారు.3 నెలల క్రితం పక్షవాతం సోకి ఓ చేయి,నడుము పని చేయకపోవడంతో మంచా నికే పరిమితమయ్యాడు. భార్య బీడీలు చేస్తూ అతి కష్టం పై కుటుం బా న్ని పోషిస్తోంది. వీరి సమస్య తెలుసుకున్న ధర్మపురి చెందిన సా మాజిక సేవకుడు రేణుకంట రమేష్ జూలై 3 న ఫేస్ బుక్ లో పోస్ట్ చేసి,వైద్యం కోసం సాయం కోరాడు.తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు స్పందించి బాధితుడి భార్య విజయ బ్యాంక్ ఖాతాకు రూ.1.27 లక్షలు విరాళాలు పంపించారు. వాటిని స్థానిక సీఐ ఎల పాటి రాం నర్సింహారెడ్డి శుక్రవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాధవ రావ్ తో కలిసి బాధితుడి భార్యకు పంపిణీ అందజేశారు.

## డివిజనల్ పరిపాలన అధికారి సేవలు చిరస్మరణీయం

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజాపక్షం/ములుగు:** డివిజనల్ పరిపాలన అధికారిగా అల్లోజు రమాదేవి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డివిజనల్ పరిపాలన అధికారి అల్లోజు రమాదేవి పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత సహదేవరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో డివిజనల్ పరిపాలన అధికారి అల్లోజు రమాదేవి అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూన్నారు. ఉద్యోగ జీవితంలో అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన డివిజనల్ పరిపాలన అధికారి అల్లోజు రమాదేవి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో తనకు సహకరించిన అధికారులు, సహచర ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అల్లోజు రమాదేవిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కృష్ణవేణి, ఏవో రాజ్‌కుమార్, మహేష్ బాబు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాల విపత్తులపై అవగాహన

**ప్రజాపక్షం/గూడూరు:** వర్షాకాలంలో సంభవించే భారీ వర్షాలు వరదలు తోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు రహదారులపై నీటి ప్రవాహం విద్యుత్ ప్రమాదాలు వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు.ఈమేరుకు గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఇరిగేషన్ రెవెన్యూ ఎంపిడివో వ్యవసాయ శాఖ పోలీస్‌శాఖ అధికారులతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శిలు జీపి అధికారులు (జీపిఓలు) పాల్గోనేలా వర్షాకాల అవగాహనర సదస్సు మరియు సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామపంచాయతీ (జీపి) స్థాయి నుంచి జీపి జీపి స్థాయి వరకు వర్షాకాల సన్నద్ధతపై తీసుకోవాల్సిన చర్యలు అత్యవసర పరిస్థితులల్లో అనుసరించాల్సిన విధానాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా చెరువులు కుంటలు కాలువలు నీటి మట్టం లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితులు రహదారుల భద్రత విద్యుత్ తీగల ప్రమాదాలు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.వర్షాకాలంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ప్రమాదకర ప్రాంతాలు పోంగిపెర్లుతున్న వాగులు చెరువులు విద్యుత్ స్తంబాలు తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో సత్యనారాయణ తహసీల్థార్ నాగభవాని ఎస్ఐ గిరిధర్‌రెడ్డి మండల వ్యవసాయశాఖ అదికారి అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గోన్నారు.

## వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

### జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, కుటుంబానికి దూరంగా ఉండి ప్రజల భద్రత కోసం అంకితభావంతో సేవలందించడం పోలీస్ సిబ్బంది గొప్పతనమని, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు కర్తవ్యనిబద్ధతతో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ రిటైర్డ్ అధికారులను అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాతూ విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిడులు, సవాళ్లు ఎదురైనా వాటిని సమర్థవంతంగా అధిగమించి సేవలందించిన రిటైర్డ్ అధికారుల సేవలు పోలీస్ శాఖకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడుపుతూ ప్రశాంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం,రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు పోలీస్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గాంధీ పార్క్ అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోండి

### బి అజయ్ సారధి రెడ్డి వినతి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డు లో గల గాంధీ పార్క్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని స్థానిక 33 వ వార్డు కౌన్సిలర్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి కోరారు. ఈ సందర్భంగా గాంధీ పార్కును చైర్ పర్సన్ జ్యోతితో కలిసి పర్యటించి అనంతరం గాంధీ పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీ పార్క్ లో సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, శ్రీరామ కళ్యాణం, సైన్స్ ఫేర్లు, విద్యావినోద అనేక సంబంధించిన సభలు కార్యక్రమాలు జరుగుతాయని దీనికోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని చైర్మన్‌ను కోరారు. గాంధీ పార్క్ పట్టణం నడిబొడ్డున అన్ని వర్గాలకు ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని, సుందరంగా తీర్చిదిద్దాలని పలు సూచనలిచ్చారు.ఈ సందర్భంగా జ్యోతి రమేష్ మాట్లాడుతూ గాంధీ పార్క్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని, తన హయాంలో అభివృద్ధి జరిగితే అది శాశ్వతంగా ప్రజల్లో ఉండిపోతుందని, ప్రజలకు సేవచేయడంలో భాగంగానే గాంధీపార్కు అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని చైర్మన్ జ్యోతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, నర్రా శ్రావణ్, అజ్మీర వేణు, మాలోత్ రవీందర్, నీలం వెంకటేశ్వర్లు, పడిదల కవిత, విక్కీ సాయి, ఎండి యూసుఫ్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట



**ప్రజాపక్షం/గూడూరు:** వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భూక్య రవి రాథోడ్ సూచించారు.అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని డీఎం హెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చేసుకోవడం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికకట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాప్తి చేందే డెంగీ మలేరియా తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇళ్లలో పరిసర ప్రాంతాల్లో నిల్వ పాత్రలు పాత టైర్లు కొబ్బరి చిప్పలు పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకొవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను చాలా వరకు నివారించవచ్చన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ హెల్త్ సూపర్‌వైజర్ రాంవెల్ హెల్త్ అసిస్టెంట్ సర్దార్‌బాబు లాలు ఏఎన్ఎం రజీత ఆశా కార్యకర్తలు పాల్గోన్నారు.

## పారదర్శకంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ



ప్రజాపక్షం/ములుగుః భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్, ఇంటెన్సివ్ రివిజన్...2026 కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ కె కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్..2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. శుక్రవారం ములుగు మండలంలోని చింతకుంట, జగ్గన్నగూడెం గ్రామాల్లో ప్రతిపాదిత కొత్త పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన భవనాల స్థితిగతులు, ఓటర్లకు సులభంగా చేరుకునే వీలుందా లేదా, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వేసి ఉండేందుకు తగిన స్థలం, దివ్యాంగులు, వృద్దులు సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేందుక ర్యాంపుల ఏర్పాటు వంటి మౌళిక సదుపాయాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలిచారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిధి, ఓటర్ల సంఖ్య, గ్రామాల భౌగోళిక పరిస్థితులు, ఓటర్ల ప్రయాణ దూరం తగ్గేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రతిపాదిత కేంద్రాల్లో ఉన్న లోపాలను వెంటనే గుర్తించి, ఎన్నికలకు ముందే అన్ని మౌళిక వసతులు పూర్తి చేయానలి ఆదేశించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడిన ఎన్నికల నమోదు అధికారి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేపడుతున్నాని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికల సంఘం లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ములుగు తహసీల్దారు ఎన్ విజయభాస్కర్, బూత్ లెవెల్ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సబ్సిడీ లోన్ పేరిట వల.. లక్షల్లో డీల్ బైక్‌తో పరార్ !

### వెల్డింగ్ కార్మికుడికి రూ. 30 వేలు టోకారా..



**ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ:** పభుత్వ సబ్సిడీ లోన్ ఇప్పిస్తాంటూ నమ్మబలికి ఓ అమాయక కార్మికుడిని ఘూరంగా మోసగించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో వెలుగు చూసింది.రూ30 వేల నగదుతో పాటు భాధితుడి కొత్తబైక్‌ను కూడా ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.కొత్తగూడ మండలం కేంద్రంలో బిలాల్ అనే వ్యక్తి వెల్లిండిగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి చెందిన జక్కుల మహేష్ అనే వ్యక్తి బిలాల్‌కు పరిచయమయ్యాడు తనకు ప్రభుత్వ సబ్బీడీ లోన్ మంజూరు చేయిస్తామని అందు కోసం రూ లక్ష కమిషన్ ఇవ్వాలని నమ్మన బిలాల్ అడ్వాన్స్‌గా రూ 30000 నగదును చెల్లించాడు నగదు తీసుకున్న దర్వాత కేటుగాడు మహేష్ తన బుద్ది చూపించాడు లోన్ మంజూరైందని కట్టుకథలు చెప్పి బిలాల్‌కు చెందిన కొత్తబైక్‌ను బలవంతంగా తీసుకెళ్లాడు ఒప్పందం ప్రకారం మిగతా డబ్బులు పూర్తిగా ఇస్తేనే బైక్ తిరిగి ఇస్తానని లేకపోతే ఇవ్వనని బెదిరింపులకు దిగాడు బాధితుడు ఎంత వేడుకున్నా వినకుండా బైక్‌తో పరారయ్యాడు.నిందితుడి వద్ద నుంచి తన రూ 30000 నగదుతో పాటు బైక్‌ను రికవరీ చేసి ఇప్పించాలని అమాయకులను మోసం చేస్తున్న నిందితుడిపై చట్టరీత్యా కఠన చర్యలు తీసుకోవాలని పోలీసులును వేడుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## కానిస్టేబుల్ సంగీత కుటుంబానికి రూ.15 లక్షల చెక్కు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మృతి చెందిన పోలీస్ మహిళ కానిస్టేబుల్ సంగీత కుటుంబ సభ్యులకు బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద మంజూరైన రూ.15 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కానిస్టేబుల్ సంగీత అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు, కానిస్టేబుల్ సంగీత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పెద్ది చిత్రపటానికి నివాళి

**ప్రజాపక్షం/నూగురు వెంకటాపురం :** వరంగల్ జిల్లా నర్సంపెట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని గెస్ట్ హస్‌లొ బీఅర్ఎస్ పార్టీ మండలం అదక్షుడు గంప రాంబాబు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రజల కొసం నిరంతరం పని చెసిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనాసాగించడం ప్రతి కారకర భాద్యత అని అనారు.ఈ కారక్రమంలొ ముదుంబా శ్రీను, వేలూరి లక్ష్మీ నారాయణ గడ్డం వివేక్, బట్ట నాగేంద్ర బాబు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపిఒ సోమ్లాల్‌కు ఎంపిడిఒగా పదోన్నతి

### వీడ్కోలు పలికిన ఎంపిడిఒ, కార్యాలయ సిబ్బంది

**ప్రజాపక్షం/మరిపెడ:** మహాబుబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిషత్ కార్యలయంలో ఎంపిఓగా విధులు నిర్వాహిస్తన్న సోమ్లాల్ ఎంపిడిఓగా పదోన్నతి పోంది ఖమ్మం జిల్లా కామేపల్లి మండల ఎంపిడిఓగా బదిలి కాగా, శుక్రవారం మరిపెడ మండల పరిషత్ కార్యలయంలో ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వాహించి కార్యదర్శులు, సర్పంచ్‌లు, మిషన్ భగీరధ,పంచాయితీరాజ్ ఇంజనీర్ అధికారులు, ఎమ్ఆర్ఇజిఎస్, కార్యలయ సిబ్బంది, జర్నలిస్టులు, ఇతరులు సోమ్లాల్‌కు శాలువలు కప్పి ఘనంగా సన్మానం చేసి,జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు.ఈ సందర్బంగా ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి,ఇతరులు మాట్లడుతూ,సోమ్లాల్ ఎంతో నిబద్దత క్రమశిక్షణ కలిగి,నిజాయితితో సేవలు అందించారని అయన సేవలను కోనియాడరు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కిరణ్,వైద్యాధికారి రవి,సూపర్‌డెంట్ యాకూబ్, ఎఈలు హతిరాం,అవినాష్, అజయ్, మంగతాయరు,సీనియర్ అసిస్టెంట్ ఇమామ్, జూనియర్ అసిస్టెంట్ గోపి, సౌజన్య, కార్యదర్శులు లెనిన్, రామోజీ, వినోద్, ఉమేష్, అరుణ్, రాజు, లక్ష్మణ్, ఆపరేటర్లు ఉమా, ఉమేష్,మునీర్,ప్రశాంత్,కారోబార్‌లు,సిబ్బాంది తదితరులు పాల్గోన్నారు.